క్లుప్తంగా

ఘనంగా లక్ష్మీ గణపతి హోమం



గుడివాడ టౌన్: స్థానిక మెయిన్ రోడ్‌లోని శ్రీ విఘ్నేశ్వరస్వామి దేవస్థానంలో సంకటహర చతుర్థిని పురస్కరించుకుని మంగళవారం లక్ష్మీ గణపతి హోమం నిర్వహించారు. వేదపండితులు కపిలవాయి అశోక్ శాస్త్రి పర్యవేక్షణలో వేదమంత్రోచ్చరణల మధ్య శాస్త్రోక్తంగా నిర్వహించిన హోమంలో 110 మంది దంపతులు పాల్గొన్నారు. లోక కల్యాణార్థం ఈ హోమం నిర్వహించడం సాంప్రదాయమని ఆలయ ఈఓ వీడీడీ ప్రసాద్ తెలిపారు.

అలీనఖీపాలెంలో ఈదే-ఘదీర్



పమిడిముక్కల: మండలంలోని అలీనఖీపాలెంలో మంగళవారం ఈదే-ఘదీర్‌ను ఘనంగా జరుపుకున్నారు. హజ్రత్ అలీని మొదటి ఇమాంగా ఇస్లామిక్ సామ్రాజ్యపు మొదటి ఖలీఫాగా ప్రకటించిన రోజును పురస్కరించుకుని షియా ముస్లింలు ఈదే-ఘదీర్ జరుపుకుంటున్నారు. గ్రామంలోని మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

సుబ్బారాయుడికి అభిషేకాలు

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్లోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో స్వామికి మంగళవారం అభిషేకాలు చేశారు. ఈ అభిషేకాలు చేయించుకునేందుకు జిల్లాలోని నలు మూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. స్వామివారి పుట్టలో పాలు పోసి అభిషేకాలు చేయించుకుని దర్శించుకున్నారు. పాలపొంగళ్లశాల వద్ద మహిళలు నైవేద్యాలు తయారుచేసి స్వామికి సమర్పించారు. ప్రధాన అర్చకుడు తోలేటీ వీరభద్రశర్మ ఆధ్వర్యంలో సుబ్బారాయుడికి 160కి పైగా అభిషేకాలు జరిగాయి. అభిషేకాలతో పాటు పలువురు దంపతులు తమ పిల్లలకు భారీసంఖ్యలో అన్నప్రాసనలు చేయించారు. సహాయ కమిషనర్ నేల సంధ్య, సిబ్బంది పర్యవేక్షణ చేశారు.

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

మండవల్లి: విద్యార్థులు మెరుగైన విద్యనభ్యసించి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎన్డీఏ నాయకులు చాపరాల దుర్గాప్రసాద్ అన్నారు. ఉనికిలి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు దుర్గాప్రసాద్, ఉపాధ్యాయిని తోట మాధవి ఆధ్వర్యంలో చలసాని కోటేశ్వరరావు ఆర్థిక సాయంతో నోటు పుస్తకాలు, పెన్నులు మంగళవారం పంపిణీ చేశారు. దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి విద్యలో రాణించి ఉత్తమ ఫలితాలు సాధించినప్పుడే ఉన్నత శిఖరాలు అధిరోహించగలుగుతారన్నారు. టి వెంకటేశ్వరరావు, జె చింతారావు, టి శేషయ్య, కె వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రెండు రోజులు నీటి సరఫరాకు అంతరాయం

గుడివాడ టౌన్: గుడివాడ కోతిబొమ్మ సెంటర్‌లో ఫ్లైఓవర్ నిర్మాణ పనుల్లో భాగంగా పురపాలక సంఘం 15వ వార్డు గుడ్‌మెన్ పేట రిజర్వాయర్ పరిధిలో రెండు రోజులపాటు నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని మున్సిపల్ ఇంజినీర్ బి. విజయదుర్గ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26, 27 తేదీలలో రిజర్వాయర్ పరిధిలోని 16, 17, 18 వార్డుల లోని కాకర్లవీధి, గీతాభవనం రోడ్, ప్రసాద్‌షెడ్ రోడ్, ద్రోణాదుల వారి వీధి తదితర ప్రాంతాలలో నీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

డ్రెయిన్లలో పూడికతీత

మండవల్లి: కానుకొల్లులో మంగళవారం కచ్చా డ్రెయిన్లలోని పూడికను తొలగించారు. సర్పంచ్ నాగదాసి థామస్ పర్యవేక్షణలో డ్రెయిన్ల అభివృద్ధి పనులు పూర్తి చేశారు. సర్పంచ్ మాట్లాడుతూ ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా ముందు జాగ్రత్త చర్యగా డ్రెయిన్లలోని పూడికను తొలగిస్తున్నట్టు తెలిపారు.

వర్ల విజయోత్సవ ర్యాలీ



పమిడిముక్కల: ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసి తొలిసారి మండలానికి విచ్చేసిన వర్ల కుమార్ రాజాకు టీడీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. మంటాడ నుంచి లంకపల్లి వరకు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. మంటాడ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మంటాడ సర్పంచ్ నందమూడి వీరమ్మ, టీడీపీ మండల అధ్యక్షుడు రాజులపాటి శ్రీనివాసరావు, నాయకులు శ్రీనివాసరావు, బాబూరావు, వెంకటసుబ్బయ్య, సుబ్రమణ్యం, నరేంద్ర, సురేష్ పాల్గొన్నారు.

వరి సాగుకు వర్షం నీరే ఆధారం

నారుమడులు సిద్ధం చేస్తున్న రైతులు



వరి విత్తనాలు చల్లుతున్న రైతులు

పామర్రు: నారుమడులు పోసే సమయం సమీపించడం, కాలువల ద్వారా వస్తున్న అరకొరా నీరు చాలకపోవడంతో ప్రస్తుతం కురిసిన వర్షపు నీటితోనే సాగు పనులను నియోజకవర్గంలోని రైతులు ప్రారంభించారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పంట బోదెలలోకి వర్షపు నీరు చేరింది. కాలువల ద్వారా వచ్చే కొద్దిపాటి నీటిని ఆయిల్ ఇంజిన్ల సాయంతో పొలాలకు నీరు పెడుతున్నారు. నారుమళ్లు పోసుకునే నేల మెత్తపడిన తర్వాత మడిలో చెత్త చెదారాలను తొలగించేందుకు మండ లాగి, చదును చేసి దుక్కిదున్ని మడులను సిద్ధం చేస్తున్నారు. పామర్రులో పలు చోట్ల సాగు భూమిలో దమ్ము మడి చేసి, నారుమళ్లలో 1061, ఎర్ర బీపీటీ విత్తనాలు చల్లుతున్నారు.

సాగునీటిపై స్పష్టత ఏదీ?

నియోజకవర్గంలో ప్రతి ఏటా సుమారు 83 వేల ఎకరాల్లో వరి సాగు చేపడుతున్నారు. సాగుకు నీరు కాలువల ద్వారా అందకపోవడంతో కొందరు బోర్ల ద్వారా వచ్చే నీటితో నారుమళ్లు పోస్తున్నారు. మరికొందరు పంటబోదెలలో ఉన్న వర్షపు నీటితోనే సాగు పనులకు శ్రీకారం చుట్టుతున్నారు. ప్రభుత్వం ఏరువాక కార్యక్రమం నిర్వహించారు. అయితే సాగుకు నీరు ఎప్పుడు విడుదల చేస్తారో అధికారులు తెలపకపోవడంతో ఆందోళన చెందుతున్నట్లు పలువురు రైతులు పేర్కొన్నారు. జూన్ నెలాఖరుకు చేరుకుంటున్న తరుణంలో వరి సాగుకు నార్లు పోసుకోవాల్సి ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వరి సాగుకు నీటిని విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.



పొలానికి ఆయిల్ ఇంజిన్ సాయంతో నీటిని పెడుతున్న రైతు

24 గంటల విద్యుత్ సరఫరా చేయాలి

వరి సాగులో నారుమళ్లు పోసుకునేందుకు కాలువలు రాని నేపథ్యంలో బోర్ల ద్వారానైనా నారుపోసుకునేందుకు 24 గంటల విద్యుత్ సౌకర్యాన్ని కల్పించాలని రైతులు కోరుకుంటున్నారు. కనీసం వారం రోజులపాటైనా 24 గంటల విద్యుత్ సౌకర్యం కల్పిస్తే బోర్ల ద్వారా వరి నారు మడులను పోసుకునే అవకాశం ఉంటుందని రైతులు చెబుతున్నారు. అంతేకాకుండా బోర్ నీటిని నిల్వ చేసుకుని, వ్యవసాయవసరాలకు వాడుకునే అవకాశం కూడా ఉంటుందని రైతులు అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సాగుకు నీరు, విద్యుత్ సౌకర్యాలను కల్పించాలని కోరుతున్నారు.

సకాలంలో నీటిని విడుదల చేయాలి

వరి సాగు ప్రారంభానికి సన్నద్ధం అవుతున్న నేపథ్యంలో సాగుకు పూర్తి స్థాయిలో నీరు లేక భగవంతుడిపై భారం మోపి కాలువలోని వర్షపు నీటినే నారుమడులకు వాడుకుంటున్నాం. ఈ నీరు అయిపోతే పరిస్థితి ఏమిటని ఆందోళనగా ఉన్నాం. ప్రభుత్వం స్పందించి సాగుకు నీటిని విడుదల చేయాలి. – కేవీ రావు, రైతు, పామర్రు

నీరులేక పోతే నష్టపోతాం

వరి సాగుకు ఈ సమయంలో నీరు అందించకపోతే రైతులు నష్టపోయే ప్రమాదం ఉంది. ప్రభుత్వం స్పందించి సాగుకు సత్వరమే నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలి. – కె.వెంకటేశ్వరరావు, రాపర్ల

అవసరమైన విత్తనాలను అందజేస్తాం

వరి సాగుకు అవసరమైన విత్తనాలు వచ్చాయి. ప్రస్తుతం వాటిని మొలక కట్టాం. త్వరలో వాటిని అందజేస్తాం. ప్రభుత్వం రైతులకు అందజేస్తున్న అన్ని పథకాలను సకాలంలో అందజేస్తూ వారికి సలహాలను, సూచనలను ఇస్తున్నాం. సాగుకు నీరు సకాలంలో ఇస్తామని ప్రభుత్వం చెబుతోంది. – శివనాగరాణి, ఏఓ, పామర్రు

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



జమిదింటకుర్రులో పుస్తకాలను పంపిణీ చేస్తున్న సర్పంచ్ శివరామప్రసాద్



వేల్పూరులో విద్యార్థులకు నోటుపుస్తకాలు అందజేస్తున్న బోసుబాబు

జమిదింటకుర్రు(పెదపారుపూడి): మండలంలోని జమిదింటకుర్రు ప్రాథమిక పాఠశాల్లో ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న యూనిఫాం, పుస్తకాలను గ్రామ సర్పంచ్ పుణుకొల్లు శివరామప్రసాద్ చేతుల మీదగా మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి జీవితంలో ఉన్నత స్థితికి చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ

పమిడిముక్కల: గత 24 సంవత్సరాలుగా వేల్పూరులోని ప్రాథమిక పాఠశాలకు నోటుపుస్తకాలు, పెన్నులు, పెన్సిల్స్, జామెట్రీ బాక్స్‌లు అందజేస్తున్న దాత తిరుమలశెట్టి బోసుబాబు సేవలు ప్రశంసనీయమని వైస్ ఎంపీపీ కొడమంచిలి మహేష్ పేర్కొన్నారు. పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు బోసుబాబు, మహేష్ కలిసి విద్యార్థులకు నోటు పుస్తకాలు, విద్యా సామగ్రి పంపిణీ చేశారు. బాగా చదువుకుని గ్రామానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాల అభివృద్ధికి సహకరిస్తున్న బోసుబాబుకు ప్రధానోపాధ్యాయుడు గుండె నానిబాబు కృతజ్ఞతలు తెలిపారు.

శిలాఫలకం మాయం



జమిదింటకుర్రు పంచాయతీ భవనం



పగలగొట్టిన శిలాఫలాకం

జమిదింటకుర్రు(పెదపారుపూడి): కొత్త ప్రభుత్వం ఏర్పడి నాటి నుంచి టీడీపీ నాయకులు అరాచకాలకు దిగుతున్నారు. మండలంలోని జమిదింటకుర్రులోని 2022లో సంవత్సరంలో పంచాయతీ భవనం నిర్మించి, ప్రారంభానికి గోడపై శిలాఫలాకాన్ని వేసి మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్, మాజీ మంత్రి కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) చేతుల మీదగా ప్రారంభించారు. ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పంచాయతీ భవనం గోడకు ఉన్న శిలాఫలకాన్ని పగలకొట్టి తీసుకెళ్లి మాయం చేశారు. ఈ విషయంపై సర్పంచ్ శివరామప్రసాద్ మాట్లాడుతూ శిలాఫలాకాన్ని ధ్వంసం చేయటం మంచి పద్ధతి కాదన్నారు. టీడీపీ నాయకులు ఈ విధంగా చేయించి, పగలగొట్టిన రాయిని పక్కనే ఉన్న చెరువుల్లో పడవేసి ఉంటారనే అనుమానం కలుగుతుందన్నారు. దీనిపై స్థానిక ఎస్ఐకు ఫిర్యాదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

బడిఈడు పిల్లలు పాఠశాలల్లో ఉండాలి



గుడ్లవల్లేరులో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, ఉపాధ్యాయులు



పామర్రులో ర్యాలీ నిర్వహిస్తున్న ఎంఈవో-2 విజయవాణి తదితరులు

గుడ్లవల్లేరు: బడిఈడు పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లో ఉండాలని ఏఐఎస్ఓ రామకృష్ణ అన్నారు. బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించేందుకు మంగళవారం కొతవరంలో అవగాహన ర్యాలీని చేపట్టారు. ఏఎంఓ ఆర్.శ్యామ్‌సుందర్ మాట్లాడుతూ బడి బయట పిల్లలు ఎవరున్నా వెంటనే సమీప ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలన్నారు. ఎంఈఓలు జి.గోపాలరావు, జి.జగన్మోహనరావు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

పామర్రులో..

పామర్రు: బడి ఈడు పిల్లలు పనిలో కాదు పాఠశాలలో ఉండాలని పామర్రు ఎంఈఓ-2 విజయవాణి పేర్కొన్నారు. స్థానిక ఆర్‌హెచ్ నగర్, కూర్మాపురాలలోని ప్రాథమిక పాఠశాలలో మంగళవారం 'నేను బడికి పోతా' కార్యక్రమం నిర్వహించారు. తొలుత విద్యార్థులతో కలిసి ఆయా ప్రాంతాల్లో ర్యాలీలు నిర్వహించారు. హెచ్ఎంలు వెంకటరత్నాలు, జ్యోత్స్న, ఉపాధ్యాయులు శౌంరి అంకరవి, విజయకుమారి పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం పనుల పరిశీలన

మండవల్లి: స్థానిక ఆరు అంగన్‌వాడీ సెంటర్లలో సర్పంచ్ మెండా ఝాన్సీ మంగళవారం శానిటేషన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ సెంటర్లలో చిన్నారుల ఆరోగ్యానికి తగిన జాగ్రత్తలు తీసుకోవలసి ఉందన్నారు. ఈ కారణంగా సెంటర్లలో ఎలాంటి చెత్త, చెదారాలు లేకుండా పారిశుద్ధ్య పనులు చేయిస్తున్నట్లు పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ నాయకుడు సురేష్ పాల్గొన్నారు.

రాష్ట్ర గవర్నర్ కార్యదర్శిని కలిసిన డీటీ



పామర్రు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ కార్యదర్శిగా పదవీ బాధ్యతలను స్వీకరించిన ఐఏఎస్ డాక్టర్ సీహెచ్ హరిజోహర్‌లాల్‌ను స్థానిక డీటీ మర్యాదపూర్వకంగా మంగళవారం కలిశారు. పామర్రు డిప్యూటీ తహసీల్దార్ గంగాధర్, తాడిశెట్టి సత్యనారాయణ, శివలు వారి ఇంటి వద్ద కలిసి శుభాకాంక్షలను తెలిపారు. వారు మాట్లాడుతూ తమ ప్రియమిత్రుడు మరిన్ని ఉన్నత పదవులను అలంకరించాలని ఆకాంక్షించారు.

ఉపాధి పనులతో మేలు

మండవల్లి: జాతీయ ఉపాధి హామీ పథకం పనులతో అందరికీ మేలు కలుగుతుందని ఎంటీఏ ఎన్.నవీన్ పేర్కొన్నారు. మండవల్లిలో పంట కాలువ పనులను రూ.92 వేల విలువైన పనులను 56 మంది ఉపాధి కూలీలు మంగళవారం పూర్తి చేశారు. ఎంటీఏ మాట్లాడుతూ ఈ పనులతో పంట కాలువలు బాగుపడతాయన్నారు.

బీఎల్‌ఓలకు పారితోషికం ఇవ్వండి

గుడివాడ టౌన్: గుడివాడ నియోజకవర్గ పరిధిలో బూత్ లెవల్ ఆఫీసర్లుగా(బీఎల్ఓ) పనిచేసిన వారికి ఎన్నికల సంఘం ఏర్పాటు చేసిన పారితోషికం ఇప్పించాలని బీఎల్ఓలు కోరారు. మంగళవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో బీఎల్ఓలు ఆర్డీఓ పి. పద్మావతికి వినతిపత్రం అందజేశారు. ఓటు హక్కు వినియోగం, ఓటర్ల నమోదు, ఇంటింట సర్వే, ఓటర్ల జాబితా తయారీ తదితర అంశాల్లో సుమారు మూడేళ్ల అధికారులకు బీఎల్ఓలుగా సేవలందించామన్నారు. ఎన్నికల కమిషన్ బూత్ లెవల్ ఆఫీసర్లకు రూ. 6 వేలు చెల్లించాలని నిర్ణయించిందని పేర్కొన్నారు. గత నెలలో జరిగిన ఎన్నికలను పురస్కరించుకుని రెండు రోజులు విధులు నిర్వహించామన్నారు. ఒక్కొక్కరికి రోజుకు రూ. 500 చొప్పున చెల్లించాల్సి ఉందని ఇది కాక ఎలక్షన్ కమిషన్ ఇతర ఎలవెన్స్‌లు ఏవైనా ప్రకటించి ఉంటే వాటిని కూడా కలిపి తమకు పారితోషకం వచ్చేలా కృషి చేయాలని కోరారు. దీనిపై స్పందించిన ఆర్డీఓ మాట్లాడుతూ పెండింగ్ బిల్లులు ఉన్నతాధికారులకు పంపుతామని వచ్చే నెలలో బీఎల్ఓలకు అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

చిన్నారులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్ల పంపిణీ

మొవ్వ: మొవ్వలోని ఐదు అంగన్‌వాడీ కేంద్రాల్లోని 23 మంది చిన్నారులకు సర్పంచ్ తూము పూర్ణచంద్రరావు చేతుల మీదగా గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ అంగన్‌వాడీలో చదువు పూర్తి చేసుకున్న చిన్నారులు ప్రాథమిక విద్యకోసం ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు తల్లిదండ్రులు ముందుకు రావాలని సూచించారు. సెక్టార్ సూపర్‌వైజర్ ఏనుగు పుణ్యవతి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కైకలూరు: విద్యుత్ నూతన లైన్ ఏర్పాటు నిమిత్తం పల్లెవాడ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు బుధవారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని గుడివాడ డివిజన్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ కె.రామకృష్ణ మంగళవారం తెలిపారు. పల్లెవాడ స్టేషన్ పరిధిలోని పల్లెవాడ, చినరామవరం, గోనెపాడు, శింగాపురం, లక్ష్మీనారాయణపురం, నత్తగుళ్లపాడు, చటాకాయి, భుజబలపట్నం, పెంచికలమర్రు, కొట్టాడ, పందిరిపల్లిగూడెం, కొల్లేటికోట, లక్ష్మీపురం, శృంగవరప్పాడు, గుమ్మళ్లపాడు, జంగంపాడు, వడ్లకూటితిప్ప, గోకర్ణపురం గ్రామాల్లో విద్యుత్ నిలుపుదల ఉంటుందని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

తోట్లవల్లూరు: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు తోట్లవల్లూరు ఎస్ఐ పి.విశ్వనాథ్ తెలిపారు. మండలంలోని బొడ్డపాడు వద్ద రెండు ట్రాక్టర్లు, భద్రిరాజుపాలెంలో ఒక ట్రాక్టరు సోమవారం రాత్రి అక్రమంగా ఇసుక తరలిస్తుండగా పట్టుకున్నట్లు పేర్కొన్నారు. ట్రాక్టర్లను తహసీల్దార్ కార్యాలయానికి అప్పగించినట్లు తెలిపారు.

మద్యం మత్తులో కత్తితో దాడి

తోట్లవల్లూరు: మద్యం మత్తులో ఓ వ్యక్తిపై కత్తితో దాడి జరిగిన ఘటన మండలంలోని భద్రిరాజుపాలెంలో జరిగింది. పోలీసులు కథనం మేరకు గ్రామానికి చెందిన గాదె సాంబిరెడ్డి, యలమంద అన్వేష్ మరో ఇద్దరు స్నేహితులతో కలిసి సోమవారం రాత్రి మద్యం తాగారు. సెల్‌ఫోన్ విషయమై అన్వేష్‌కు సాంబిరెడ్డికి మధ్య వాగ్వాదం జరిగింది. ఇరువురి మధ్య వివాదం పెరగటంతో అన్వేష్ కొడవలితో సాంబిరెడ్డిపై దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో సాంబిరెడ్డి వీపుపై గాయాలయ్యాయి. అతడ్ని వెంటనే ఉయ్యూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పి.విశ్వనాథ్ తెలిపారు.

దివ్యాంగులకు వైద్యశిబిరం

కైకలూరు: నియోజకవర్గ స్థాయిలో దివ్యాంగులకు స్థానిక భవిత సెంటర్‌లో నిర్ధరణ వైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. కైకలూరు, కలిదిండి, మండవల్లి, ముదినేపల్లి మండలాల నుంచి వచ్చిన మానసిక దివ్యాంగులు 40 మంది, అంగవైకల్యం 34 మంది, శ్రవణ వైకల్యం 40 మంది, అంధత్వం 11 మంది కలిపి మొత్తం 125 మందికి దివ్యాంగత్వ పరీక్షలను వైద్యులు చేశారు. ఈ సందర్భంగా ఏలూరు జిల్లా సమగ్రశిక్షా విలీన విద్య సమన్వయకర్త బొర్రా భాస్కరరాజు మాట్లాడుతూ 6–18 సంవత్సరాల దివ్యాంగ బాలబాలికలను గుర్తించి ఉచిత ఉపకరణాలు పంపిణీ చేసేందుకు శిబిరం ఏర్పాటు చేశామన్నారు. దాదాపు అందరికీ పరికరాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు డి.రామారావు, వి.శ్రీనివాసరావు, డాక్టరు అమరకోటేశ్వరరావు, ఫిజియోథెరపిస్టు ఉండవల్లి రాధారాణి, కంటి వైద్యులు విజయ రథాకుమార్, వినికిడి నిర్ధారణ వైద్యురాలు వై.గోవర్ధని. నాలుగు మండలాల ఐఈఆర్‌టీలు, ఎంపీసీలు, సీఆర్పీలు, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత



కైకలూరు/ముదినేపల్లి రూరల్/మండవల్లి: ఆధ్యాత్మిక చింతనతో ప్రతి ఒక్కరికీ మానసిక ప్రశాంతత దక్కుతోందని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ పేర్కొన్నారు. నియోజకవర్గంలో పలు దేవాలయాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో ఆయన మంగళవారం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. లోకుమూడిగరువు దత్తాశ్రమంలో సంకటహట చతుర్థి సందర్భంగా విఘ్నేశ్వరునికి ఉండ్రాళ్ల సేవ నిర్వహించారు. కామినేని పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ముదినేపల్లి మండలం ప్రొద్దువాక శ్రీలక్ష్మీగణపతి స్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇదే మండలంలో అల్లూరు రేణుకా ఎల్లమ్మతల్లికి పూజలు చేసి జాతర మహోత్సవాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎంపీపీ అడవి కృష్ణ, ఆర్‌వీ.సూర్యనారాయణరాజు, దండు రంగరాజు, వేంపాటి విష్ణురావు, ఏఈ శ్రీను, గొర్తి ప్రభాకరదీక్షితులు, వేంపాటి సాయి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి గ్రామోత్సవం



నిమ్మకూరు(పామర్రు): గ్రామంలోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీశ్రీనివాస మూర్తి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం కల్యాణమూర్తులకు గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ బ్రహ్మోత్సవాల్లో భాగంగా రాత్రి స్వామి వార్ల కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. తొలుత ఆలయంలో పూజా కార్యక్రమాలను అర్చకులు యోగానంద లక్ష్మీనరసింహాచార్యులు(స్వామి) ఆధ్వర్యంలో నిర్వహించారు.

పోస్టల్‌లో పొదుపు చేస్తే సొమ్ము భద్రం

గుడ్లవల్లేరు: పోస్టాఫీసులో సొమ్మును పొదుపు చేసుకుంటే వినియోగదారుల సొమ్ము భద్రంగా ఉంటుందని గుడ్లవల్లేరు పోస్ట్‌మాస్టర్ పి.వి.రాజ్‌కుమార్ అన్నారు. ఆయన తన సిబ్బందితో కలిసి గుడ్లవల్లేరులో సుకన్య, మహిళా సమృద్ధి, సేవింగ్స్, రికరింగ్ డిపాజిట్, రూరల్ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ పథకాలపై మంగళవారం ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది సుధాకర్, సుశీల, భీమేశ్వరరావు, విజయ్‌రావు, శివప్రసాద్, శివకుమార్ నాయుడు, లక్ష్మయ్య పాల్గొన్నారు.

బాలికకు ఆర్థిక సాయం

మండవల్లి: పెరికెగూడెంలో కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న బాలికకు ఎస్సై రామచంద్రరావు, సిబ్బంది మంగళవారం ఆర్థిక సాయం అందజేశారు. మండలంలోని పెరికెగూడెం గ్రామానికి చెందిన పిండి నాగలక్ష్మి కుమార్తె పుష్పలత కొంత కాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతోంది. ఈ విషయం తెలిసిన ఎస్సై, సిబ్బంది దీవెన ఫౌండేషన్ ద్వారా బాలికకు మూడు నెలలకు సరిపడా సరుకులు, కొంత నగదు సాయం అందజేశారు.

గ్యాస్ అక్రమ వాడకాలపై దాడులు

గుడివాడ టౌన్: గృహ అవసరాలకు వినియోగించే గ్యాస్ సిలెండర్లను హోటళ్లలో వాడటం నిషేధం అని విజిలెన్స్ సీఐ కె. వెంకటేశ్వరరావు అన్నారు. పట్టణంలోని పలు హోటళ్లలో విజిలెన్స్ అధికారులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. అక్రమంగా నిల్వ ఉంచిన ఆరు సిలెండర్లను సీజ్ చేసి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నాగబాబుకు అప్పగించినట్లు ఆయన తెలిపారు.

ర్యాగింగ్ చట్టరీత్యా నేరం



సదస్సులో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీకాంత్

గుడ్లవల్లేరు: కాలేజీలో విద్యార్థులను ర్యాగింగ్ చేస్తే చట్టరీత్యా నేరమని గుడివాడ డీఎస్పీ పి.శ్రీకాంత్ పేర్కొన్నారు. గుడ్లవల్లేరు ఏఏఎస్ఎం అండ్ వీవీఆర్ఎస్ఆర్ పాలిటెక్నిక్ విద్యార్థులకు ఆయన మంగళవారం అవగాహనా సదస్సును నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ డ్రగ్స్ వాడినా చర్యలు తీవ్రంగా ఉంటాయన్నారు. చట్ట వ్యతిరేకమైన చర్యలతో బంగారు భవిష్యత్ కలిగిన జీవితాలను నష్టపోవద్దని విద్యార్థులకు ఆయన హితవు పలికారు. కార్యక్రమంలో మెంటార్ ఎస్.ఎస్.ఎస్.వి.రామాంజనేయులు, ప్రిన్సిపాల్ రాజశేఖర్, సీఐ కె.ఏసుబాబు, ఎస్ఐ జి.సత్యనారాయణ పాల్గొన్నారు.

మంత్రి అచ్చెన్నాయుడి దృష్టికి కొల్లేరు సమస్యలు

కైకలూరు: కొల్లేరు సమస్యలను రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు దృష్టికి రాష్ట్ర వడ్డీలు కన్వీనరు బలే ఏసురాజు, కొల్లేరు పెద్దలు మంగళవారం తీసుకెళ్లారు. మత్స్యశాఖ మంత్రిగా ఆయన బాధ్యతలు చేపట్టిన తర్వాత విజయవాడ నివాసంలో కలుసుకుని ముందుగా అభినందించారు. కొల్లేరులో ప్రజల జీవన పరిస్థితులు, భూముల సమస్యలు, వేట నిమిత్తం మావుల తయారీకి వెదురుగడల పంపిణీ వంటి అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. మంత్రిని కలిసిన వారిలో కొల్లేరు ప్రాంత నాయకులు మల్లికార్జునరావు, సుబ్బరాజు, గాంధీ, కొండలరావు, వంశీ, ముంగర ఏసురాజు, కృష్ణకాంత్ ఉన్నారు.

డయేరియాపై అప్రమత్తంగా ఉండాలి

తోట్లవల్లూరు: డయేరియాపై అప్రమత్తంగా ఉండాలని మహిళా సంరక్షణ కార్యదర్శి జంపాన శివలీల పేర్కొన్నారు. తోట్లవల్లూరులోని కొత్త ఎస్సీ వాడ అంగన్‌వాడీ కేంద్రం ఏరియాలో డయేరియా, చేతుల పరిశుభ్రతపై మంగళవారం ఆమె అవగాహన కల్పించారు. కాచి చల్లార్చిన నీటినే తాగాలని, వంట పాత్రలను వేడి నీటితో శుభ్రపరచుకోవాలని తెలిపారు. ఆహారం తినే ముందు, తిన్న తరువాత చేతులు శుభ్రంగా కడుక్కోవాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు భాగ్యం, కోకిలరాణి, విజయకుమారి, మల్లీశ్వరి, సలోమి పాల్గొన్నారు.